# డా విం ఛీ

పెళ్ళి అనేది చాకిరేవు లాంటిదని. మాసినబట్టలు చాకలి నించి తిరిగి రాగానే చమక్‌మన్నట్లు, పెళ్ళి కాగానే మగాడికి లోపాలు, బలహీనతలు ఏవన్నా ఉంటే అవన్నీ సర్దుకుపోయి బుద్ధిమంతుడు, తెలివైనవాడు అయిపోతాడని వెంకట్రావుగారి గాఢ నమ్మకం.

అందుచేత ఆయన వో మంచి ఉదయం చూసి జనార్దనరావుతో యిలా అన్నాడు.... "అరేయ్ జన్నీ! ప్రేమ సెలవలకి యింటికి వచ్చిందిరా"

"వూహుఁ ?" అన్నాడు జన్ని.

"షష్టుక్లాసే వస్తూదంటూంది."

"ఊహుఁ" ఏం పట్టనట్టు వూకొట్టసాగాడు.

"నువ్వు శలవులకి ఇంటికి రాకూడదూ ? యిక్కడ ఒక్కడివీ ఏం చేస్తావు ?"

"నేనా ? నా కిక్కడ బోలెడు పనులు మామా, అసలు ఉన్న టైమే చాలడంలేదు. ఎలాగా అని చూస్తున్నాను" తడబడ్డాడు జన్ని.

"నీ పనేమిటో నాకు తెలుసులేవోయి, రోజుకొక సినిమా, క్లబ్‌లో రమ్మీ, హోటల్లో పదిమందికి మేత పెట్టడం అంతేనా ?"

జన్నీ మాట్లాడలేదు.

"జన్నీ నేను చెప్పేది విను. నువ్వు చాలా మంచివాడివి. నీ మనసు చాలా మంచిది. కానీ మంచితనం ఒక్కటే చాలదు. తెలివితేటలుండాలి. నేర్పుండాలి. అంతే అవి నీకు లేపనిగాదు. ఉన్నవి సరిపోవు, మీనాన్న వదిలి వెళ్ళిన ఆస్తి బోలెడు ఉంది కాబట్టి పదిమందిని జేరేసి ఖర్చుపెట్టేస్తున్నావు. కాని యిలా చాలాకాలం వుండడం కష్టం కాబట్టి పెళ్ళి చేసుకో. ప్రేమ ఇకనమిక్స్ ఆనర్సు పరీక్ష రాసింది. చిన్నప్పటినించి దాని తెలివి తేటలు ఎలాంటివో అందరికి తెలుసు. యింత అరాజకంగా ఉన్న నీ జీవితాన్ని చక్కపెడ్తుంది, అన్నట్టు నీవు దాన్ని చూచి చాలా రోజు లయింది. ఒక్కసారి రా. మీరిద్దరూ చదువుకున్నవాళ్ళు కాబట్టి స్వేచ్ఛగా అన్ని సంగతులు మాట్లాడుకోవచ్చు." వెంకట్రావుగారుఉపన్యాసం యిచ్చినట్లుగా తొందరగా అన్నీ చెప్పేసి యింక జన్ని చెప్పాల్సిందేం లేదన్నట్లు చూశారు. ఆయన్ని తలచుకున్నప్పుడల్లా హిట్లర్, ముస్సోలినీ, స్టాలిన్ వగైరాలు గుర్తుకొస్తారు జన్నికి.

ప్రేమని చూసి రెండేళ్ళయింది. ప్రేమ అందంగా ఉంటుందా? ఏమో! కాని ప్రేమను తల్చుకున్నప్పుడు జన్ని ఎదలో ప్రేమ రగలదు. సున్నితం. లాలిత్యం. మార్దవంలాంటి జన్నీ కెంతో యిష్ట మయిన లక్షణాలు ఆమె పేరులో మాత్రం ఉన్నాయిట.

కాని ఆ విషయం వెంకట్రావుతో చెప్పగల ధైర్యం, మానసిక బలం జన్నికి లేవు. అంచేత ప్రేమ ఎవరోన్నిగాని, ఎవరో ప్రేమనిగాని లేదా వెంకట్రావు తననిగాక మరొకర్నిగాని ప్రేమించి, ప్రేమ పెళ్ళి తనతో తప్పిపోయేలా చేయడానికై దేవుడ్ని గుర్తు చేసుకుంటూంటాడు జన్ని.

ఆ సాయంకాలం అలా పోతూంటే పరమేశ్వరరావు కనిపించాడు. "ఎన్నాళ్ళయిందిరా పరం, నిన్ను చూసి? ఏం చేస్తున్నావు యిన్నాళ్ళూ? ఏయే పూళ్ళు చూశావు? ఎంతమందిని ప్రేమించావు? అసలు కనబడకుండా

ఏమై పోయావు పోనీ ఉత్తరమైనా వ్రాసి ఏడవ్వేం?" జన్నీ ప్రశ్నల వర్షం కురిపించాడు.

"ఆరు నెలలు చదవటం యిష్టంలేని అబ్బాయిలకి చదువు చెప్తున్నాను. చూసిన వూరు ఒకటే. పదకొండు మందిని, డబ్బు సంపాదించే దెలాగన్న జంజాటనలో. చదువు, స్నేహితులు, వగైరా అన్నీ మరిచి పోయాను, ఉత్తరం వ్రాసి ఏడవడానికి టైం దొరకలేదు." వరస క్రమంగా జవాబిచ్చాడు పరం.

"ఆ వూళ్ళో ఏం చేస్తున్నావు?" పరం చెప్పిన వూరుపేరు విన్నాక ఆశ్చర్యంగా అడిగాడు జన్ని,

"చెప్పానుగా, వో కుర్రాడికి చదువు చెప్తున్నాను."

"అదేం? నీ చదువు ఏమయింది? మళ్ళీ మార్చికి కట్టానన్నావుగా."

"మార్చికి కట్టున్నాను కాని మా నాన్న మనకి ఏడాది కింత అని ప్రివీపర్సు ఏర్పాటుచేశాడీమధ్య, మన ఖర్చు-ఆదాయాన్ని మించిపోతూంది. డిశంబరుదాకా రావాల్సింది ఫిబ్రవరిలో అయిపోయింది. ఆయనని మళ్ళీ అడగడం యిష్టంలేదు. అందుకని "సంపాదించుకుని, చదువు" అన్న సూత్రం అమలుపరుస్తున్నాను."

"ఆ వూరులో వెంకట్రావు అని వో పెద్ద మనిషి ఉన్నారు తెలుసా?"

"వాళ్ళ అబ్బాయికేగా నేను పాఠాలు చెప్పేది!"

"బుజ్జికి నీవు గురువువా? గాడ్ సేవ్‌యూ! భగవంతుడు రక్షించుగాక!" ముందు ఇంగ్లీషులోనూ, ఇంగ్లీషురాని పాఠకులకోసం తరువాత తెలుగులోనూ అన్నాడు జన్ని.

"దేముడు రక్షించేందుకు ఏమీలేదు! బుజంగరావుకి చేపలు పట్టడం హాబీ బంగాళా బాబుల నవలలు చదవడం రెండోది. ఒకగాలం గారెముక్కలు పుచ్చుకుని వాళ్ళ యింటి వెనక కాలవ వద్దున కూర్చుంటాడు ఇరవై నాలుగు గంటలు చేపలు పట్టడం, అవి గిలగిల తన్నుకున్నాక మళ్ళీ నీళ్ళలో

వదలడం - అదీ అతని పని. ఆపని చేసుకోనిస్తే మనకు పోయేదేంలేదు. మన జీతం రాళ్ళు మనకు ముట్తాయి; వెంకట్రావుగారు అటుకేసి రారు, ఇంకా ఆ యింట్లో అతన్ని అడిగేవారు లేరు.

"పూఁ. మళ్ళీ కొత్తగా ఎవరినైనా ప్రేమించావా?"

"నీకు వేళాకోళంగానే ఉంటుందిగాని. ప్రేమలాంటిది మరొకటిలేదు. యీ ప్రపంచంలో ఆ ఆలోచనే ఎంత తీయగా వుంటుందో చూడు!" పరం కళ్ళు కలల్లో తేలిపోతున్నాయి.

"నువ్వు చెప్పే ప్రేమ ఎవరన్నా మనిషి పేరా? లేక ప్రేమించ డానికి సంబంధించిన నామవాచకమా?"

"కుమారి ప్రేమ వెంకట్రావుగారి అమ్మాయి. ప్రేమని తల్చు కున్నప్పుడల్లా నా గుండెల్లో సితార్ మీటినట్లు, ఎక్కడో దూరాన మబ్బుల నించి లత, అశ, గీత, వగైరాలంతా పాడుతున్నట్లు, నేను అలా అలా నీలి మైదానాల్లో చుక్కలమధ్య తేలిపోతున్నట్లు ఏవేవో నాకే తెలియని చెప్ప డానికి మాటలు చాలని అనుభూతులు కలుగుతున్నాయి."

"మై పుట్!"

"నా గురించేమన్నా భరిస్తానుగాని, ఆమెని మాత్ర మేం అనకు. ఇంతకీ ప్రేమ నీకు తెలుసా?

"తెలుసు."

"ఒక్కసారి నాకు పరిచయం చెయ్యి. నీ రుణం మళ్ళీ జన్మలో నువ్వు అమ్మాయై పుడ్తే నిన్ను ప్రేమించి తీర్చుకుంటాను.!" ప్రాధేయ పడ్డాడు పరం.

* * *

నాలుగు రోజులు పోయాక ఆ వూర్లో వెంకట్రావుగారింట్లో అన్నిని ఒక ముఖ్య అతిథిగా చూశాడు పరం. ఆ సాయంకాలం ఇద్దరూ కాలవ వడ్డున తోటలో కూర్చుని కబుర్లు చెప్పుకూంటూంటే దూరంగా పంతెనపేద గాలం నీళ్ళలోకి వదిలి కనపడ్డాడు బుజ్జి.

ఉన్నట్లుండి జన్నీకి ఒక అద్భుతమైన ఆలోచన వచ్చింది.

"పరం నీకు ప్రేమ మనసు కావాలి గదూ!"

"మన సొక్కటేగాదు, ఇంకా చాలా కావాలి."

"అయితే నేను చెప్పేది విను. ప్రేమకి ఈ బుజ్జి అంటే పంచ ప్రాణాలు. ఇతగాడు కాలుజారి ఆ వంతెనమీదనుంచి నీళ్ళలో పడ్డాడనుకో వూపిరాడదు మూడు మునకలూ అయిపోతాయి. ప్రేమ అలా ఒడ్డుననిలబడి 'రక్షించండి! రక్షించండి!' అని బుల్లి తమ్ముడికోసం అరుస్తూంటుంది. అప్పుడు ఈ గుబుర్ల చాటునుంచి టెర్లిన్ ప్యాంటుతో సహా నీళ్ళలో కురికి వాడిని బయటికి లాగి ప్రథమ చికిత్స చేసి తి గి ప్రాణం పోస్తావు. ప్రేమ మనసు కృతజ్ఞతతో నిండిపోతుంది. "మీరెంత మంచివారండీ! మీరు లేకపోతే నా చిట్టి తమ్ముడు ఏమైపోయేవాడో! సమయానికి దేముడిలా వచ్చి కాపాడారు. మీ ఋణం ఎలా తీర్చుకోడం! ....అరే పాపం మీ టెర్లిన్ ప్యాంటుకాస్తా పాడైపోయిందే చ్....చ్ ప్చ్...." అని వాపోతుంది.

"ఓ దట్సాల్‌రైట్ మానవ సేవయే మాధవ సేవ." అంటూ చప్పరిస్తావు నీవు. అప్పుడు ఆమె అభిమానం, గౌరవం, ప్రేమ, ఇత్యాదులు నిండిన కళ్ళతో ఒక్కసారి నీ కేసి వాలుగా చూసి తల దించుకుంటుంది....."

"గోష్.... టెర్రిబుల్ జన్నీ, నీ మెదడు యింతేసి ఆలోచల్ని ఉత్పత్తి చేస్తుందంటే నమ్మలేకుండా వున్నాను. చాల ఆశ్చర్యంగా వుంది .... అయితే ఒక చిక్కుంది. ఆతగాడి కాలు ఎప్పుడు జారుతుందో! అప్పటి దాకా యింతేనా?" దైన్యంగా అడిగాడు పరం.

"అదంతా నేను చూసుకుంటానుగా రేపు సాయంకాలం నాలుగింటికి నువ్వీ గుబుర్లో దాక్కో ప్రేమనిక్కడికి తీసుకువస్తాను. కాసేపటికి బుజ్జి నీళ్ళలో పడతాడు. వెంటనే నీళ్ళలో కురికి రక్షించు."

అంత చక్కని ఆలోచన పుట్టినందుకు తనని తానే అభినందించుకుంటూ రాత్రి హాయిగా నిద్రపోయాడు జన్ని.

జన్నీకి ఓ పెద్ద రణరంగంలో వెద్దయెత్తున వ్యూహాన్ని పన్నుతున్నంత సంబరంగా వుంది. యుద్ధభూమిలో జనరల్ ముందుగా బ్రిగేడియర్స్‌ని పిలుస్తాడు.

“నీ టాంక్స్‌ని యీ గుట్టమీదకి నడిపించు.”, “నీ గన్స్‌ని యీ కొండవాలులో యీ కోణంలో వుంచు.”, “నీ ట్రూప్స్‌ని ఇలా నడిపించు” అని ఇసుక మాడల్ మీద వివరించుతాడు. ఈ మూడు అనుకున్న చోట్లకి, అనుకున్న సమయానికి చేరుకుంటే దీపావళి! మజా చూడ ముచ్చటగా వుంటుంది. అలాకాక టాంక్స్ మరో గుట్ట మీదకి, గన్స్ వేరేచోటకి వెళ్ళి, ట్రూప్స్ అనుకున్న వేళకి రాకపోతే ఫలితం అలా యెందుకయింది చర్చించడానికి వేరే మనుష్యులు రావాలి.

కానీ జన్నీకి తన వ్యూహం గురించిన ఫలితం విషయంలో ఎలాంటి అనుమానమూ లేదు. వంతెన చివర్న నాలుగింటికి బుజ్జి ఎలాగు కూర్చునుంటాడు. ప్రేమ జన్ని వచ్చే వేళకు ఊర్లోలేదు. కాలక్షేపానికి ఎవరో స్నేహితురాల్ని పిలుచుకురావడానికి ప్రక్క వూరు వెళ్ళిందట. కాని రేపటికి తప్పకుండా వచ్చేస్తుందంది అత్తయ్య. రాగానే ఆమె నక్కడికి తీసుకురావడం తన చేతిలో పని, మిగతాదంతా సెకన్లమీద జరిగిపోతుంది.

మర్నాడు సాయంకాలం అంతా అనుకున్నట్లే జరిగింది. ప్రేమ ఉదయమే వచ్చింది. అలా తోటలో తిరుగుదాం అని తీసుకువచ్చాడు ప్రేమని. జన్ని.

“నువ్వెంత మంచివాడివి బావా! నాకోసం యింత దూరం వచ్చావని విని ఎంత పొంగిపోయానో తెలుసా?” అంది ప్రేమ జన్నిప్రక్కన నిలబడి.

జన్ని సమాధానం ఈయలేదు.

దూరంగా బుజ్జి వంతెన ప్రక్క రెయిలింగ్ మీద కూర్చుని గాలం నీళ్ళలో ఆడిస్తూ అటే చూస్తున్నాడు.

"ప్రేమా, నీతో ఒక సంగతి చెప్పాలని వుంది. ఏమనుకుంటావో."

"చెప్పు బావా మనలో మనకేమిటి ?"

"నా స్నేహితుడొక డున్నాడు,"

"ఉన్నాడు ...వుంటే?"

"వాడికి నిన్ను తలుచుకున్నప్పుడల్లా గుండెల్లో తీయని బాధ కలుగుతుందిట. లత. ఆశ, గీత డ్యూయెట్లు పాడుతున్నట్లు, మేఘాలు సితార్ వాయించినట్లు. చంద్రలోకంలో అప్సరసలు నాట్యం చేస్తున్నట్లు, ఉంటుందిట."

"ఉహుఁ" ఆశ్చర్యం నటించింది. ప్రేమ.

"నిన్ను చూడకుండా ఉండలేడు, చూసి వేగలేడు, వెన్నెల్లో వేడి చల్లగాలి గాడ్పు మల్లెల్ని తాకితే ముళ్లు గుచ్చుకోవడం, అది వాడి పరిస్థితి. నీకు వింటూంటే జాలి కలగడంలేదూ."

ప్రేమ నవ్వు బలవంతాన ఆపుకుని, తల ప్రక్కకు తిప్పుకుంది.

"అది సరేగాని. బావా తమ్ముడు చూడు ఎంత చిగుర్న కూర్చున్నాడో? వద్దంటే వినడు. క్రిందపడితే ఏం కాను.

"నే పిలుచుకొస్తా నుండు." జన్ని బయల్దేరాడు.

అద్భుతమైన అవకాశం. దగ్గిరికి వెళ్ళినట్టే వెళ్ళి భుజాన్ని అలా తాకితే చాలు క్రింద పడతాడు. సమయం సరిగ్గా నాలుగు యీపాటికి పరం అగుబుర్ర లోనికి చేరుకొనుండాలి. ఏదన్నా మంచిపని తలపెడితే, ప్రయత్నం లేకుండానే అన్నీ వాటంతట అవి సమకూడ్తాయనేవాడు. తెలుగు మాష్టరు ఆయన మాట యిక్కడ రుజువైంది జన్నీ మనసులో తెలుగు మాష్టరికీ దేముడికీ. కృతజ్ఞత చెప్పుకున్నాడు.

"హల్లో బుజ్జీ. హౌ! ఆర్ యూ ?"

"హౌ ఆర్ యూ ?" చాలా మామూలుగా అని జన్ని వంక చూశాడు బుజ్జి. అప్పటికి జన్నికిబుజ్జికిమధ్య దూరంఅయిదడుగులు వుంది.

ఆ అయిదడుగులు జన్నీ ఎన్ని అడుగులు వేసినా తరగనట్టుంది. జన్ని మనసులో ఆందోళన. ఆరాటం ఎప్పటికప్పుడు ఆ మధ్య దూరాన్ని రెండు పెట్టి గుణిస్తూంది. చెమటలు పోయసాగాయి.

ఆ పరిస్థితి అంతకుముందు ఒకసారి అనుభవమైందతనికి. కాలేజీలో నాటకం వేస్తున్నారు. జన్ని వంటవాడు, ఒక అమ్మాయి మహారాణి. స్టేజి మధ్యలో టేబిల్ వేశారు. మహారాణి భోజనానికి అన్ని అమర్చి వున్నాయి. వంటవాడు మంచినీళ్ళు పట్టుకురావాలి ట్రేలో. జన్ని తెర లేవగానే స్టేజి మధ్యకు నడిచాడు, స్టేజి ఆ మూల నడవడం మొదలు పెడితే ఎంతకీ 'మధ్య' అనేది రావడంలేదు. సహారా యెడారిలా మైళ్ళకి మైళ్ళు సాగిపోతూంది. కళ్ళు మూసుకుని అక్కడికిచేరి, తెరిచిచూసే సరికి మహారాణిగారు ఇంకా రాలేదు, ట్రేలోగ్లాసు భరతనాట్యం, కథాకళి, చాచాచా, ట్విస్ట్ అన్నీ వరసపెట్టి చేసేస్తూంది. చివరికి అలిసిపోయిన గ్లాసు విసిగెత్తి క్రిందపడబోయింది, కాని అదృష్ట వశాత్తు మహారాణిగారు అప్పుడే వేంచేయడంవల్ల ఆమె పైట మడతల్లో ఆగింది. ఆమె అదొక మాదిరి శబ్దంచేసింది. ఆశబ్దం హాలంతా ప్రతిధ్వనించి వెయ్యి శబ్దాలైంది. కాని జన్నీ మెదడ్లో కేమీ ఎక్కలేదు. ఎదురుగా ఆకాశమంత స్టేజి, మధ్యలో దిక్కు తోచని తను.

బుజ్జి దగ్గిరికి ఆపుకోలేని వుత్సాహంతో అడుగులు వేస్తూంటే జన్ని మనసులో ఆ నాటి సంఘటన తాలూకు చెణుకులు మెదడ్లో మెదిలాయి. ఒళ్ళు ఇంకా చెమటలు పోసింది.

బుజ్జి జన్నివంక అదోలా చూశాడు. 'ఎవడ్రా నువ్వు'? అన్నట్లు ఆ చూపు చూస్తూంటే జన్నికి ఏంత అనుభూతి కలుగుతుంది, కాలేజీలో చేరిన మొట్టమొదటి రోజు, తనకి సరిగ్గా అతకని డొల్లపాంటుతో, క్లాసుకి ఆలస్యంగా అబ్బాయిలు, అమ్మాయిలు అంతా గుచ్చి చూస్తూంటే, నూరు అడుగుల దూరం సిమెంటు ఫ్లోర్‌మీద కిర్రుమనే కొత్త చెప్పుల హోరు బ్యాగ్రౌండ్ మ్యూజిక్ యిస్తుంటే నడిచి వెళ్ళినప్పుడు యెలా ఈగ, నల్లి,

దోమ అంతకన్న చిన్నది అయిపోయినట్టు అనుకున్నాడో, యించుమించు అలాగే అన్పిస్తూంది యిప్పుడూనూ.

కాని యిది చాలా పెద్ద పని. దీనిమీద ఒక్క పరం భవిష్యత్తు మాత్రమే కాదు. తనదికూడా ఆధారపడివుంది. కాబట్టితనవ్యక్తిగతయిబ్బంది ఎలాంటిదైనా అనుకున్న పని చేసి తీరాల్సిందే.

“ఏరా యెలా వుంది చదువు ?”

“మరీ ముత్తాతలాచదువు వెలాగుంది ? రోజూ వేళకు తిండీ తింటు న్నావా ? జీర్ణమవుతుందా ? అంటూ ఈ చచ్చు ప్రశ్నలేమిటి బావా ?” బుజ్జి నవ్వాడు.

జన్నికి కొంచెం అవమానమనిపించినా భరించాడు.

“ఏయే సినిమాలు చూశావు ఈ మధ్య ?

“యిదొక బోర్ ! అయిదో క్లాసు చదివే ఆడపిల్ల అడుక్కునే ప్రశ్న.”

జన్ని ఇంకేం మాట్లాడలేదు. కళ్లు మూసుకుని భుజంమీద చరిచాడు, అదోలా నవ్వుతూ అంతే.

జన్ని కళ్లు తెరిచేసరికి బుజ్జి నీళ్ళలోంచి తేలుతూ మునుగుతూ ఉన్నాడు, ఇదే సమయం పరం రావాలి కాని ఏడి ?

పరం రావడంలేదు. జన్ని యీల వేద్దామనుకున్నాడు. పరం పరం అని అరుస్తూ వంతెన ఆమూలనించి ఈమూలకి పరుగెత్తాలనుకున్నాడు. కాని ప్రేమ దూరాన్నించి పరుగెత్తుకొస్తూంది. తన గురించి ఏమనుకుం టుందో !

యింక తప్పదు,

మరో అయిదు సెకన్లకి జన్ని నీళ్ళలోకి వురికాడు. బుజ్జిని రక్షించక పోతే, వాడికేదన్నా అయితే, మామకి మొగమెలా చూపెట్టడం ?

నీళ్ళలో మొదటి మునక మునిగి లేచేసరికి బుజ్జి అయిదు గజాల దూరంలో యీదుతూ కనిపించాడు. బుజ్జికి యీత వచ్చునా?.. అరే ఆ సంగతే అనుకోలేదు జన్ని ఆలోచన వదిలి బుజ్జిని పట్టుకోబోయాడు. కాని బుజ్జి ఆ అయిదు గజాల్నీ పది గజాలుచేసి తొందరగా ఒడ్డు చేరాడు. రక్షించాలనే సద్బుద్ధివుంటే మాత్రం ఆ అవకాశం రానప్పుడు ఏంచేస్తాం? తప్పనిసరిగా జన్ని యీదుకుంటూ ఒడ్డు చేరాడు, కుట్టించి నెలయినా కాని టెర్లిన్ పాంటు బురదలో మునిగి ధ్వంసమయింది.

బుజ్జి తొందరగా యింట్లోకి పరిగెట్టాడు.

ప్రేమ వడ్డున నిలబడి విరగబడి నవ్వుతూంది.

జన్ని నెమ్మదిగా లేచి పైకి వచ్చాడు.

"ఎందుకలా నవ్వుతావు? మీ తమ్ముడ్ని రక్షించినందుకు కృతజ్ఞత చెప్పడం మానేసి." కోప్పడ్డాడు జన్ని.

"బావా...." ప్రేమకి మాటలు రావడంలేదు. నవ్వుతూంది.

"బా....వా....యు....ఆర్....నీవు....గ్రేట్....ఉహ్!....వండర్ ఫుల్!... అబ్బ...."....నవ్వు కెరటాలు వస్తూంటే మధ్యమధ్యన ఒక్కొక్క ముక్క బయట పడుతుంది.

జన్ని నీళ్ళలో తడిసి ముద్దయి మున్నగా ముందుకి, కళ్ళ మీదికి జారిన జుట్టు వంకా, చొక్కా, పాంటూకొసల నించి జారుతున్న బురదనీళ్ళ వంకా చూశాడు.

ప్రేమ నవ్వు ఉప్పెనకాస్త తగ్గాక "బావా, నువ్వింత ప్లానుతో యిక్కడికి రావడం, స్నేహితుడి వంకబెట్టి విరహ బాధ బయటపెట్టడం, నన్ను యింప్రెస్ చెయ్యాలని, తమ్ముడ్ని నీళ్ళలో తోసి, మళ్ళీ బయటికి తీయాలనుకోడం ఓహ్, యింత లోతు మనిషివని కల్లోకూడ అనుకోలేదు. రోజుకో సినిమా చొప్పున చూస్తూంటే ఆ ఆలోచనలే రాకేమవుతాయి! మానమంటే మానవు!"

జన్ని అయోమయంగా చూశాడు.

"అసలు యింత తిప్పలు యెందుకు బావా? నే నెలాగు నీదాన్నేగా" ప్రేమ చిన్నగా నవ్వుతూ దగ్గరగా వచ్చి తడిసిపోయిన షర్టు బటన్లు విప్పింది. జన్నికి ఏమైంది. ఏమవుతూంది ఏమి అంతు చిక్కడంలేదు.

"నేనివాళ రాత్రి నాన్నతో చెప్పేస్తాను! బావ పెళ్ళికి తొందర పడుతున్నాడని. ఏం! లేకపోతే యీ యింటికి నిప్పంటించేసి ఆర్పాలని యెత్తేస్తావు రేపొద్దున్న?" జన్ని భుజాలమీద చేతులువేసి తల అతని మెడ దగ్గిర ఆన్చి నవ్వింది ప్రేమ.

"నువ్విలా నా మీద వ్రాలిపోతూ, యింత చనువుగా హేళనగా మాట్లాడేవంటే, 'కాబోయే భర్తతో ఏ భారతస్త్రీ యింత అమర్యాదగ మాట్లాడదు, యిది హిందూ సాంప్రదాయానికి వ్యతిరేకం. హన్నా" అని చదివే వాళ్ళకి రాసేవాడిమీద కోపం వస్తుంది. కాబట్టి అలా దూరంగా నిలబడి, కొంచెం మర్యాదగా మాట్లాడడం నేర్చుకో" జన్ని తొందరగా యింట్లోకి నడిచాడు. ప్రేమను తప్పించుకుని.

• • •

ఆ మర్నాడు పరం కనిపించాడు జన్నికి.

"నిన్న సాయంకాలము ఎక్కడ తగలడ్డావు?" నమిలి మింగేయా లన్నంత కసిగా ఉంది జన్నికి.

"ఏం చెప్పమంటావు? నిన్న ప్రేమ ఒక అమ్మాయిని తీసు కొచ్చింది.... పేరు తెలియదుగాని...."

"రత్నమాల"

"వ్హాట్ ఎ నేమ్?! ఏంపేరు! నిజంగా అలాంటి అందాన్ని ఎక్కడా యింతవరకు చూడలేదు. అసలు యింతకుముందు అంతటి అందానికి మానవులనర్హులనుకున్నాడేమో దేవుడు!"....

"యిప్పుడు నువ్వొకడివి వున్నావని గుర్తు చేసికొని... నీ కోసం పంపించాడు అవునా?....సిల్లీ ఫెలో!....యింతకీ ఆమె ధ్యానంలోపడి నిన్నక్కడ హాజరవ లేదంటావు, అవునా?!"

"ధ్యానమేమిటి! మేమిద్దరం బర్న్స్ కవిత్వం గురించి చర్చించాం. ఏమన్నాడు బర్న్స్? 'నా ప్రేమ నవవసంతంలో నవ్విన లేత గులాబీ! నా ప్రేమ చక్కని బాణీలో తేలిన మధురగానం! ...నేను ప్రేమిస్తూనే వుంటాను యీ సముద్రా లింకిపోయేదాకా! యీ కొండలు ఎండకి కరిగి పోయేదాకా!...." పరం కవిత్వ ధోరణికి ఫుల్‌స్టాప్ కనపడడం లేదు.

"డామ్ యువర్ లవ్!....నీవు ...నీ ప్రేమ....డామిట్!" శపించి నట్టు అనేసి వెళ్ళిపోయేడు జన్ని.

(ఆంధ్ర సచిత్రవారపత్రిక నుండి గ్రహింపబడినది)